జిందగీ
# చింతన
**నమస్తే తెలంగాణ** హైదరాబాద్
సోమవారం 8 ఏప్రిల్ 2024
www.ntnews.com
13




మంగళవారం ఉగాది

# ఆరు రుచుల అద్భుతం

**ఉగాది కాలానికి సంకేతం. మానవ జీవనానికి, కాలానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకునే ఆనందవేళ ఉగాది. కాలాన్ని గుణిస్తూ, మారుతున్న కాలానికి (రుతువులకు) అనుగుణంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలనే సందేశాన్నిస్తుందీ పండుగ. సహనానికి, వ్యక్తిత్వ నిర్మాణానికి, మనోవికాసానికి ఆలవాలంగా నిలుస్తుంది.**

**ఉగాది** పండుగలో అన్నిటికన్నా విశేషమైంది ఉగాది పచ్చడి. మిగిలిన పండుగల్లో పిండివంటలు చేసుకుంటే ఉగాది రోజున పచ్చడి చేసుకుంటాం. అది కూడా పూర్తిగా స్వాభావికంగా. ఏవిధంగానూ పచనం (వండటం) చెయ్యకుండా తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు, కారం.. ఈ ఆరు రకాల రుచులు అందించే పదార్థాలు కలిపి తయారుచేసే పచ్చడి ఇది.

**ఈ** రుచుల్ని కలపడానికీ ఓ లెక్క ఉంది. తీపి, కారం సమానంగా కలపాలి. వీటి మోతాదుకు సగభాగం పులుపు, వగరు, వీటికి సగభాగం ఉప్పు, చేదు కలపాలి. మానవజీవితం అన్ని రుచుల కలయిక. అన్ని రుచులూ కలిస్తేనే మనిషి శరీరం సమగ్రవికాసాన్ని అందుకుంటుంది. మనస్సు విశ్వతోముఖంగా ప్రసరిస్తుంది. అందుకే ఉగాది నాడు ఆరు రుచుల పచ్చడిని ప్రసాదంగా అందజేస్తారు. మధురానుభూతుల తీపి, కష్టాల చేదు, సమస్యలతో మింగుడుపడని కారం, బాధల ఉప్పు, కడగండ్ల పులుపు, అపజయాల వగరు జీవితంలో సహజ రుచులు. వీటిని సమన్వయం చేసుకుని, అనుకూలంగా రంగరించుకుని ప్రయాణించడమే జీవనం.

**ఉగాది** పచ్చడిలో ఉపయోగించే పదార్థాలన్నీ శరీరంలో సమతూకాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందింపజేస్తాయి. సంవత్సరం పొడవునా జీవితంలో ఏర్పడే కష్టనష్టాలు, సుఖసంతోషాలను సమానంగా స్వీకరించి ముందుకుసాగాలనే తాత్త్విక సందేశం ఉగాది పచ్చడిలో ఉంది.

**తీపి** కామానికి, కారం క్రోధానికి, ఉప్పు మోహానికి, పులుపు లోభానికి, చేదు మదానికి, వగరు మాత్సర్యానికి సంకేతాలు. మనం తినే పదార్థాలు ఏవైనప్పటికీ ఈ ఆరు రుచుల్లోకే వస్తాయి. ఏదో ఒక రుచి లేకుండా మనం ఏ పదార్థాన్నీ తినలేం. కాబట్టి, అన్ని రుచులను సమీకరించుకుని తింటే మనం గెలిచినట్లు. ఏదో ఒక రుచిని మాత్రమే మెచ్చుకుని, దాన్నే తీసుకుంటే ఓడినట్లు.

... శ్రీ భారతి

# విరిసే వసంతం.. జగతికి శ్రీమంతం


**ఎండిన మోళ్లు చిగురుతొడగడం, లేత పిందెలతో, ఎర్రెర్రని చివుళ్లతో కోయిలలకి ఆహ్వానం పలుకుతూ మావిళ్లు, సుగంధ మరంద మాధురీ వీవెనలతో నెత్తావులు...నేల సమర్తాడినట్లు ఉగాది అంటేనే ఆకాశానికి రెక్కలొచ్చినంత సంబురం. పురుడోసుకున్నంత తన్మయత్వం జగతికి! కొత్త ఆశలతో, మరిన్ని ఊహాంకురాలతో బతుకు సాగించాలనే ఉబలాటం ఈ మనిషికి.**

**ఉగాది** అంటేనే ప్రకృతితో సమాగమం. గుప్పెడు గింజలు చల్లి గంపెడు ఫలసిద్ధిని పొందే రైతుకు సేద్యమంటేనే ప్రకృతి జీవనాదరువు. పూలు పూయని కాయలు కాయని గొడ్డు బారిన చెట్టంటూ ఏ తరువునూ కొట్టిపారెయ్యలేం. ప్రకృతి ఎప్పుడూ ఒక్కలాగానే ఉండదు. మనిషి జీవనావస్థల్లాగానే ఏటా వసంతం కుసుమించదు. చీకటి తరువాత వెలుతురులాగా, మండు వేసంగి వెనుకే చల్లని మబ్బులాగా, అమవసనిశి వెంటనే కదిలొచ్చే పున్నమి కాంతిలాగా రాలే ఆకులే చివురులవుతాయి మోడుకు. మధుర దరహాస మధుకర పల్లవములవుతాయి మోముకు. ఆరు రుతువుల కాలచక్రం విరామమెరుగక తిరుగుతుంటే... ప్రభవ, విభవాది వత్సరాలు పరుగులెడుతూ పునరావృతమవుతూ అనంత జీవన చైతన్యంలోకి అంతుచిక్కని జీవన పరిమళంలోకి, ఒకానొక అస్పష్ట వాంఛాంకురంలోకి మనిషిని తీసుకుపోయి నిలబెడుతుంది ఉగాది.

**ఉగాది** అంటే వనాలకు ఎడంగా కాదు గాఢంగా పెనవేసుకుని బతకాలి. రాలే ఆకుల నిట్టూర్పులే వాసంతరాణికి కైమోడ్పులుగా మనసులో నిత్యోత్సవం తొలకరించినా చాలు ప్రకృతితో రససిద్ధిని పొందినట్టే. కుసుమలతా పతాక! కోకిలబాకా!! వహవ్వా! ఎన్నాళ్లకు రాక!! అంటూ... వనసీమల్లో సంచరించే ప్రకృతిమాతకు ప్రణమిల్లడమే జీవన్ముక్తి. వత్సరాలు వస్తుంటాయి... పోతుంటాయి. రాలు పూల గంధాలు, హరిత పత్ర నయనాలు, పుప్పొడి గంధ లేపనాలు, తేటుల, తూనీగల సయ్యాటలు... ఒక్కో రుతువు ఒక్కో శోభను మోసుకొచ్చి ఒకానొక చైతన్యపు అంచున నిలబెడతాయి మనిషిని. ఎప్పుడూ ఆనందాలే కాదు... కలతలూ, కష్టాలూ, కన్నీళ్లూ.. అన్నీ క్షణికాలే. ఏదీ ఎక్కువ కాలం అదిమి పట్టుకుని ఉండదు. పడిలేచే కెరటంలాగా, ఎండిన చెరువుకు తొలకరి జలకళలాగా, నిజానికి వసంతం ఎండిన ఎడదకొక నిగారింపు. ఇదే ప్రకృతి స్పర్శతో మనిషి జీవన కొనసాగింపు. ఎన్నెన్ని ఉగాదులొస్తున్నాయి.. పోతున్నాయి! ఏం చెబుతున్నాయవి!! నిలకడగా, నిబ్బరంగా కష్టిస్తూ... పదుగురికీ ఉపాధులు సమకూర్చే చెట్టులా ఎదగడమొక్కటే కాదు ఒదిగి ఉండాలంటున్నాయి. తరువులతి రస ఫలభారగురుతగాంచు/ నింగివ్రేలుచు నమృతమొసంగు మేఘు/ డుద్ధతులుగారు బుధులు సమృద్ధి చేత/ జగతినుపకర్తలకు నిది సహజగుణము. అమృత జలధారలతో మేఘాలు నేలకు దిగొస్తాయి. ఫల సమృద్ధితో తరువులు ఒదిగి ఉంటాయి. ప్రకృతి పరులసేవే పరమార్థం అంటున్నది. ఉదారత, దాతృత్వం, జగతిలో పదుగురి ఉన్నతికోసం పరితపించే వారి సహజగుణాలు.

వనమున్న చోట కిలకిలరావాలు ఉంటాయి. పంట సిరులు ఉన్నచోట పురోగతి ఉంటుంది. చేతికష్టం, శ్రమించే తత్వం, పదిమందికీ చేయూతను ఇవ్వాలనే గుణం... ఇవన్నీ విశ్వమానవ చైతన్య రథచక్రాలు. ఉగాది యశోగీతికలు ఉదయతంతువులై తొలకరించాలంటే గొప్ప సిద్ధాంతాలు, గొప్ప పూజలు చేయడం కన్నా ఒక చెట్టును పెంచడం మేలు. ఉగాది విభవం అనంతరూపమై అవగతమవ్వాలంటే ఒక వనమాలిగా బతుకు సాగించడం మేలు. అప్పుడు కదా.. తరువే కోకిలమై మనసంతా నిండేది! బతుకంతా పాటలాగ వాసంత సమీరమై సాగేది.

... సాహితీసుధ
94940 44429



గురువారం ఈదుల్ ఫిత్ర్



Eid mubarak

**ఓ రంజాన్ వసంతమా కాస్తంత నిదానంగా కదులు!**
**ఇంకా ఎన్నెన్నో మంచి పనులు చేయాలి!**
**అల్లాహ్ మెప్పు పొందాలి!**
**పాపాలకు పశ్చాత్తాపం చెందాలి!**
**జన్నత్ కోసం సంసిద్ధులవ్వాలి!**
**ఓ రంజాన్ వసంతమా కాస్తంత నిదానంగా కదులు!**

# అల్లాహ్ మెప్పు పొందుదాం



**రంజాన్** వసంతం చివరి దశకు చేరుకుంది! ఈ పవిత్ర నెల ఎడబాటును తలుచుకుంటూ 'అల్ విదా మాహె రంజాన్' అంటూ వీడ్కోలు గీతాలు పాడుకుంటున్నారు. అల్లాహ్ కారుణ్యాలను, కానుకలను మోసుకొచ్చిన ఈ నెల కొద్ది రోజుల్లో తరలి వెళ్లిపోతుండటంతో ముస్లింల హృదయాలు ద్రవించిపోతాయి. ఈ నెలలో చేసిన రోజా, నమాజులు, దానధర్మాలకు స్వీకృతి ప్రసాదించమని చివరి బేసి రాత్రుల్లో మేల్కొని అల్లాహ్‌ను వేడుకుంటారు. ఖురాన్ అవతరించిన ఐదు బేసి రాత్రులు తరావీ నమాజుతోపాటు తహజ్జుద్ నమాజులు కసరత్తుగా చేస్తారు. రంజాన్‌లోని ప్రతీ ఘడియనూ సద్వినియోగం చేసుకునేందుకు, అల్లాహ్ మెప్పు పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తారు. వచ్చే రంజాన్ వరకూ మమ్మల్ని క్షేమంగా ఉంచమని దైవాన్ని వేడుకుంటారు.

### ఆ రాత్రి దైవదూతలు దిగివస్తారు!

ఈదుల్ ఫిత్ర్ పర్వదినానికి ముందురోజు రాత్రి సప్తాకాశాల పైనుంచి భూమండలానికి దైవదూతలు దిగివస్తారు. ఈ రాత్రిని 'లైలతుల్ జాయిజా' అంటారు. నెల రోజులు పాటించిన రోజా, నమాజులు, దానధర్మాలకు గాను దైవదూతలు ప్రతిఫలమిచ్చే రోజు. ఒక్కో సత్కార్యానికి ఏడు రెట్ల పుణ్యఫలాన్ని లెక్కించి కర్మల పత్రంలో లిఖిస్తారు. 'నా దాసులు రోజంతా ఆకలి దప్పులతో గడిపారు, రాత్రుళ్లు నిద్రను త్యాగం చేసి నమాజులో నిల్చున్నారు. ఇలాంటి దాసులకు నేను ముక్తిని ప్రసాదిస్తున్నాను' అని అల్లాహ్ ప్రకటిస్తాడు. ఈ సంతోషంతోనే ముస్లింలంతా కలిసి ఈద్ రోజు ఈద్గాలో షుక్రానా నమాజు చేస్తారు.

### పండుగ సంతోషాలు నిరుపేదలకు..

పండుగ సంతోషాలను చుట్టుపక్కల నిరుపేదలతోనూ పంచుకోవడం సంప్రదాయం. పండుగ నమాజ్ కంటే ముందే పేదలు, అభాగ్యులు, వితంతువులకూ ఫిత్రా దానం చేసి వాళ్లనూ పండుగ సంతోషాల్లో భాగస్వాములను చేస్తారు. అసలు ఫిత్రా నుంచే ఫిత్ర్ వచ్చింది. ఫిత్రాలు పంచుతారు కాబట్టే ఈదుల్ ఫిత్ర్ అని పిలుస్తారు. ఇది ఆసాంతం పేదసాదల పండుగ. ఒక్కో వ్యక్తి రూ.80 నుంచి రూ.100 చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పేరున లెక్కకట్టి పేదలకు అందిస్తారు. ఆహార పదార్థాలు, వస్త్రాలు, నగదు రూపంలో అయినా ఫిత్రా చెల్లించవచ్చు. పండుగ రోజు ఏ ఒక్క అభాగ్యుడూ చేయిచాచి అడగరాదన్నదే ఫిత్రా దానాల పరమార్థం అని ముహమ్మద్ ప్రవక్త (స) సందేశం.

ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) పరిపాలనా కాలమది. ఆయన పరిపాలనా కాలంలో మచ్చుకైనా ఒక్క పేదవాడు కూడా ఉండేవాడు కాదు. జకాత్ తీసుకునే వారే ఉండేవారు కాదు. అప్పు తీసుకునేవారూ లేరు. అంత సంక్షేమ పాలనను అందించేవారు. ఒకానొక ఏడాది రంజాన్ నెలలో ఆయన సతీమణి ఫాతిమా బిన్తె 'ఏవండీ! పిల్లలు పండుగకు కొత్త బట్టలు కావాలంటున్నారు' అని అడిగారు. 'అయ్యో మన దగ్గర అంత స్తోమత లేదే' అన్నాడు ఉమర్ అజీజ్. తల్లి చాటున నిల్చుని ఉన్న పిల్లల్ని చేరదీసి గుండెలకు హత్తుకున్నాడు. తన పిల్లలకు కొత్త దుస్తులు కొనలేకపోతున్నామే అని ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. ఉండబట్టలేక తన భర్తతో 'మీ కోశాగారం నుంచి వచ్చే నెల జీతం ముందస్తుగా తీసుకోండి' అని సలహా ఇచ్చింది. భార్య మాటలకు పునరాలోచనలో పడ్డాడు. ఆమె మాట కాదనలేక వేతనం కోసం కోశాధికారికి దరఖాస్తు రాశాడు అజీజ్. ఆ లేఖను చదివిన అధికారి 'చక్రవర్తి గారూ! మీరు వచ్చే నెల వరకూ బతికుంటారని రుజువేదైనా ఇస్తారా' అన్నాడట. ఆ మాటకు ఖలీఫా బోరున విలపించాడు. ఇంటికొచ్చి తన పిల్లలతో 'పిల్లలూ మీ నాన్న నరకాగ్నికి ఆహుతి కావడం మీకిష్టమా?' అని రోదిస్తూ అడిగాడు. అప్పుడు ఆ పిల్లలు 'నాన్నా మనమంతా పండుగను నిరాడంబరంగా జరుపుకొందాం' అని తండ్రిని ఓదార్చారు. చక్రవర్తి అయినా.. ప్రజాధనాన్ని తన అవసరాలకు వాడుకోరాదని ఈ కథ చెబుతున్నది.

> పండుగ శుభాకాంక్షలు చెప్పే పద్ధతి 'మీకూ మీ కుటుంబ సభ్యులకూ ఈద్ ముబారక్' 'ఈ ఈద్ శుభదినాన అల్లాహ్ మీపై కారుణ్య వర్షం కురిపించుగాక' 'మీరు రంజాన్ సంతోషాలను ఏటా మళ్లీ మళ్లీ జరుపుకోవాలి' 'ఈద్ శుభ సంతోషాన మీకు ప్రేమపూర్వక శుభాకాంక్షలు' 'మీకు ఈద్ శుభాకాంక్షలు. మీ రంజాన్ ఆరాధనలను అల్లాహ్ తన కారుణ్యంతో స్వీకరించాలని ప్రార్థిస్తున్నాను' అని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలియజేయాలి.
> ”

### నిగ్రహాన్ని నేర్పిన ఉపవాసాలు

రంజాన్ నెల రోజా రోజులు నిగ్రహాన్ని నేర్పుతాయి. పరోపకారాన్ని బోధిస్తాయి. సానుభూతిని తెలియజేస్తాయి. దేవుడు చూస్తున్నాడన్న తలంపును తట్టిలేపుతాయి కాబట్టి 14 గంటల పాటు ముస్లింలు అన్నపానీయాలకు దూరంగా ఉంటారు. ముహమ్మద్ ప్రవక్త ద్వారా అల్లాహ్ తరఫు నుంచి ఖురాన్ గ్రంథం లభించినందుకు కృతజ్ఞతగానే ఈ ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఖురాన్ అంటే మాటిమాటికీ చదివే గ్రంథమని అర్థం. ఈ పవిత్ర గ్రంథం ధరణిపై కల్లోలాన్ని అస్సలు సహించదు. అశాంతిని కోరుకోదు. దగా, మోసం, అబద్ధం, దౌర్జన్యాలను సహించదు. ఖురాన్ ప్రేమ సందేశాన్నిస్తుంది. తల్లిదండ్రులను సేవించి స్వర్గానికి బాటలు పరుచుకోవాలని తాకీదు చేస్తుంది. బంధువుల అనాథల హక్కులు నెరవేర్చాలని హెచ్చరిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే జీవితానికి ఆదర్శవంతమైన దారి చూపుతుంది.

### పండుగ ఇలా చేద్దాం..

1. పండుగ పూట తెల్లవారుజామునే లేవడం ప్రవక్త సంప్రదాయం.
2. తల స్నానం (గుసుల్ స్నానం) చేయాలి. మిస్వాక్ పుల్లతో దంతధావనం చేసుకోవాలి.
3. అత్తరు పరిమళాలు పూసుకోవాలి.
4. ఈద్ నమాజుకు ముందు తియ్యని పదార్థాన్ని సేవించడం గానీ, బేసి సంఖ్యలో ఖర్జూరాలు గానీ తినాలి.
5. ఈద్ నమాజు కన్నా ముందే ఫిత్రా దానం చేయాలి.
6. పిల్లలకు కానుకలు ఇవ్వాలి. బంధుమిత్రులకు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవాలి.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076


## యోగ సాధన



**మానవ దేహం** భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలతో, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనే పంచకోశాలతో, 72 వేల నాడులతో పాటు మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రారం అనే ఏడు ప్రధాన చక్రాలే కాకుండా అనేక ఉపచక్రాలతో ఏర్పాటైంది. వీటన్నిటిని చైతన్య పరచుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయి. అందుకు యోగసాధనే అసలైన మార్గం. అష్టాంగ యోగంతో పూర్వం రుషులు అష్టసిద్ధులనూ సాధించారు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలను దర్శించగలిగారు. అంతరిక్షంలో జరిగే అద్భుతాలను, గ్రహ గతులను వీక్షించగలిగారు. సామాన్య మానవుడూ ఈ అద్భుతాలను సాధించగలడు. అందుకు సద్గురువు మార్గదర్శకత్వంలో యోగాన్ని సాధన చేయాలి. యోగం వల్ల కలిగే లాభాలు అనేకం. అంతిమ ప్రయోజనం జన్మరాహిత్యం.

శనివారం మత్స్య జయంతి

# చేపగా వచ్చి.. చేవను చూపి..



**లోకాలను** కాపాడటానికి శ్రీహరి అనేక అవతారాలను దాల్చాడు. అందులో మొదటిది మత్స్యావతారం. చేపగా వచ్చి.. చేవ చూపి.. వేదాలను కాపాడిన పర్వదినం చైత్ర శుక్ల పంచమి. వైవస్వతుడు సూర్యుడి కొడుకు. మనువు కాకముందు ఆయన పేరు సత్యవ్రతుడు. ద్రవిడ దేశాన్ని ధర్మంగా పాలించేవాడు. రాజ్యాన్ని కొడుకులకు అప్పగించి మలయపర్వతంపై చాలాకాలం తపస్సు చేశాడు. సత్యవ్రతుడి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై ప్రళయకాలంలో ప్రాణులందరినీ రక్షించే శక్తిని అనుగ్రహిస్తాడు. ఒకరోజు కృతమాల నదిలో తర్పణం వదులుతూ ఉంటే సత్యవ్రతుడి దోసిట్లో ఓ చేప పడుతుంది. దానిని మళ్లీ నీటిలో వదులుతాడు. 'జలచరాలు తింటాయని నాకు భయం' అంది చేప. 'రక్షిస్తావని నీ దోసిట్లోకి వస్తే, మళ్లీ నీళ్లలో వదులుతావా!' అంటుంది. అప్పుడు రాజు చేపను తీసుకొని కమండలంలో వేసి తీసుకెళ్తాడు. చూస్తుండగానే చేప పరిమాణం పెరుగుతుంది. దానిని మరో జలపాత్రలో వేస్తాడు రాజు. క్షణాల్లో చేప పరిమాణం ఆ పాత్ర మేరకు పెరుగుతుంది. బావిలో, చెరువులో, పెద్ద సరోవరంలో వేసి చూశాడు. దాని పరిమాణం పెరుగుతూ పోయింది. చివరకు సముద్రంలో వదిలాడు. కడలినంతా ఆక్రమిస్తూ చేప పెరిగిపోయింది. ఆ మాయ అంతుబట్టక 'ఎవరు నీవు?' అని అడుగుతాడు రాజు. అప్పుడు ఆ మీనం 'నేను విష్ణుమూర్తిని. ఇవాళ్టికి ఏడో రోజున ప్రళయం ముంచుకొస్తుంది. ముల్లోకాలూ నీటిలో మునిగిపోతాయి. చిమ్మచీకటి కమ్ముకుంటుంది. నీ దగ్గరికి ఒక పెద్ద నౌక వస్తుంది. సూక్ష్మ శరీరాలతో సమస్త ప్రాణులను, సమస్త ఔషధులను, సప్త రుషులతో ఆ పడవను ఆశ్రయించు. నేను మత్స్య రూపంలో వస్తాను. ఒక మహా సర్పం కనిపిస్తుంది. దాన్ని తాడుగా చేసి నావను, నా కొమ్ముకు బంధించు. నేను రక్షిస్తాను' అంటాడు. సత్యవ్రతుడు ఏదో అడగబోతుంటే.. 'సృష్టి పునఃప్రారంభం తర్వాత నీ ప్రశ్నలన్నిటికీ జవాబులు చెబుతాను. తర్వాతి సృష్టికి నీవే ప్రజాపతివి' అని మాయమైంది. తర్వాత ఏడు రోజులకు విష్ణుమూర్తి మత్సరూపధారిగా వారిని రక్షిస్తాడు. తర్వాత సత్యవ్రతుడికి బ్రహ్మతత్త్వాన్ని ఉపదేశిస్తాడు. వేదాలను రక్షించి రాజుకు అప్పగిస్తాడు. మత్స్య నారాయణుడు అందించిన వేదజ్ఞానమే మానవ నాగరికతకు మూలం.

... విష్ణువర్ధన్

# పక్షి.. చీమ..

> శుకో ముక్తో వామదేవోఽపి ముక్తః
> తాభ్యాం వినా ముక్తిభాజో న సంతి
> శుక మార్గం యేనుసరంతి ధీరాః
> సద్యో ముక్తాస్తే భవంతీహ లోకే

(వరాహోపనిషత్ 4– 34)

ఉపనిషత్ వాక్యం



శుకుడు, వామదేవుడు ముక్తులు. శుకునిది సద్యోముక్తి. వామదేవునిది క్రమముక్తి. తక్షణమే కలిగేది సద్యోముక్తి. అనేక జన్మలు కష్టపడితే కలిగేది క్రమముక్తి. సద్యోముక్తికి ఎంతో పరిశుద్ధమైన మనసు కావాలి. అప్పుడు ఒకే ఒక్క ఉపదేశం చాలు. క్షణంలోనే ముక్తి కలుగుతుంది.

శుకుడు వేదవ్యాసుని కుమారుడు. పరమహంస. నదిలో దిగంబరంగా స్నానం చేస్తున్న అప్సరసలు శుక మహర్షి వెళుతుంటే సిగ్గుపడలేదు. ఆ వెనుకే వ్యాసుడు వెళ్తే సిగ్గుతో దుస్తులు వేసుకున్నారు. వ్యాసుడు అడిగితే 'శుకుడికి దేహస్పృహ, స్త్రీపురుష భేద దృష్టి లేదు. ఆయన మనసు బ్రహ్మంలో లీనమైంది. మాకు సిగ్గు కలుగలేదు. కానీ, మీకింకా ఆ స్థితి రాలేదు. కాబట్టి మీరు వృద్ధులైనా మేం సిగ్గుపడాల్సి వచ్చింది' అన్నారు. శుక మార్గానికి ఉదాహరణగా కొందరు మహనీయులు కనిపిస్తారు. తోతాపురి ఆదేశించిన తక్షణమే రామకృష్ణ పరమహంస మనసు పరబ్రహ్మంలో లీనమైంది. ఏకబిగిన మూడు రాత్రులు సమాధిలో ఉండిపోయాడు. అలాగే పరమహంస తాకినంత మాత్రాన వివేకానందుడు సమాధిలోకి వెళ్లిపోయాడు.

వామదేవుని మార్గంలోని వాళ్లు మళ్లీ మళ్లీ పుడుతూ, చస్తూ యోగం, సాంఖ్యం అనుసరిస్తూ మంచి పనులు చేసుకుంటూ క్రమంగా ముక్తి పొందుతారు. మనుషుల్లో చాలామంది ఇలాంటి వారే! ఎన్నో జన్మలకు గాని వీరికి పరిపక్వ స్థితి రాదు. సద్యోముక్తులు పొడిపొడి అగ్గిపుల్లలు అయితే, వీళ్లు తడిసిన అగ్గిపుల్లలు. ఈ రెండు మార్గాలనూ దేవుడే కల్పించాడు. శుకుడు విహంగం అంటే పక్షి. వామదేవుడు పిపీలికం... అంటే చీమ. పక్షి అమాంతం గాలిలోకి లేచి చెట్టు చిటారు కొమ్మకు చేరుతుంది. చీమకు చాలా సమయం కావాలి. పట్టుదలగా పాకి చేరుకుంటుంది. కారణం వివేక వైరాగ్యాలనే రెక్కలు లేకపోవడమని ఈ ఉపనిషత్ వాక్యం ఉపదేశిస్తుంది.

... డా॥ వెలుదండ సత్యనారాయణ

# ఏది గొప్ప సాయం?

**ఇతరులకు** సాయం చేయడం గొప్ప విషయమే! కానీ, మనం చేసే సాయం ఆ వ్యక్తి దీర్ఘకాలిక అవసరాలను ఎంతగా తీర్చగలిగితే అంత విశేషమైనదిగా నిలిచిపోతుంది. అది అతని అవసరాలను శాశ్వతంగా తీర్చగలిగితే మహోన్నత సాయం అవుతుంది. మన బాధలను శాశ్వతంగా తొలగింపజేసేది తత్వజ్ఞానం మాత్రమే! కాబట్టి మనిషి చేసే పారమార్థిక సాయమే లోకంలో సమున్నత, మహోన్నత సాయం అవుతుంది.

మనల్ని ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిలో నిలబెట్టేదే ఉత్తమ సాయం. జ్ఞానాన్ని అందించే విద్యా విషయకమైన సాయానిది తర్వాతి స్థానం. విద్యాదానం.. అన్నదానం, వస్త్రదానాల కన్నా ఉన్నతమైనది. విద్యాదానం తరువాత వచ్చేది భౌతిక సాయం. లౌకిక వ్యవహారాల చుట్టూ పరిభ్రమించే ఏ సాయమూ శాశ్వత ఆనందాన్ని ఇవ్వదు. ఆత్మబలం లోపించిన వ్యక్తి అవసరాలను కూడా సరిగ్గా సమకూర్చుకోలేడు. సంసార బాధలను ఉపశమింప జేయడానికి భౌతిక సాయం ఒక్కటే చాలదు. వ్యక్తి స్వభావం మారేవరకు ఈ శరీర ఆవశ్యకాలు, దుఃఖాలు సదా కలుగుతూనే ఉంటాయి. ఎలాంటి భౌతిక సాయమూ వీటిని పూర్తిగా తొలగించలేదు. మనిషిని పవిత్రుడిగా చేయడమే ఈ సమస్యకు పరిష్కారం. మనిషిని జ్ఞానిగా, విశుద్ధుడిగా, ఆత్మ బలాఢ్యుడిగా, విద్యావంతుడిగా తీర్చిదిద్దడమే నిఖార్సైన సాయం. అప్పుడే లోకంలోని దుఃఖం తొలగిపోతుంది.

... చంద్రశేఖర్